క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రం అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తురాలు శనివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. గుంటూరుకు చెందిన జి.కల్పవల్లి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

'ప్రజాగళం' పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు

జంగారెడ్డిగూడెం: పెద్దల సభకు ముఖ్యంగా గ్రాడ్యుయేట్ కోటాలో ఎన్నికయ్యే అభ్యర్థి స్వతంత్ర అభ్యర్థి అయి ఉండాలని, రాజకీయ పార్టీలకు కొమ్ము కాయకూడదని, ప్రజాసంఘాలతో, ప్రజలతో పనిచేసే వ్యక్తి కావాలని ఎమ్మెల్సీ ఇళ్ళ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన పీడీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ బలపరిచిన డీవీ రాఘవులుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని ఆయన కోరారు. యూటీఎఫ్, ప్రజాసంఘాలు, ఉద్యమ సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు



కొయ్యలగూడెంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రేరణ తరగతుల వలన ఫలితాలలో మెరుగైన ర్యాంకులు సాధించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా సహాయ సాంఘిక సంక్షేమ అధికారి వి.జయప్రకాష్ పేర్కొన్నారు. శనివారం ప్రకాశం డిగ్రీ కళాశాలలో సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ముప్పిడి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కష్టపడి ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని అన్నారు. ప్రకాశం కాలేజీ కరస్పాండెంట్ జనార్ధన్, కొయ్యలగూడెం పరిధిలోని వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట: ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని చింతలపూడి సహాయక సాంఘిక సంక్షేమ అధికారి టి.రత్న కుమార్ అన్నారు. శనివారం స్థానిక బాలుర, బాలికల వసతి గృహాలను సందర్శించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రావుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వసతి గృహాలలోని 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. హాస్టల్ వార్డెన్‌లు డి.సువర్ణరాజు, ఆర్.అంజనాదేవి, శ్రీనివాస్, స్వర్ణలత, ప్రభావతి ఉపాధ్యాయులు బిరుదుగట్ల నాగేశ్వరరావు, పోరంకి నాగరాజు, వేము శ్రీరామ్మూర్తి, పిరమిడ్ నిర్వాహకులు రామకృష్ణ పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

పెదవేగి : భర్త వేధింపులపై ఓ మహిళ పోలీసులకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి. పెదవేగి మండలం తాళ్లగోకవరంనకు చెందిన ఎండీ నసీమాతో 2023లో కొవ్వూరుకు చెందిన ఖాదర్‌వల్లీతో వివాహమైంది. కొంతకాలం గడిచిన తర్వాత ఖాదర్‌వల్లి, అత్త ముంతాజ్ బేగం, మరిది దిల్షాద్, చోట తోటికోడలు కలిసి అధిక కట్నంకోసం నసీమాను శారీరంగా, మానసింగా హింసిస్తున్నట్టు తెలిపారు. నసీమా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

విజయీభవ..

- పక్కా ప్రణాళికలతోనే పదో తరగతిలో మంచి మార్కులు
- మార్చి 17 నుంచి పరీక్షలు
- గిరిజన పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ, స్టడీ అవర్స్ నిర్వహణ
- సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు



పాలకుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రాత్రివేళ స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మరో నెల రోజుల్లో ప్రారంభం కానున్నాయి. మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే పదికి పది పాయింట్లు సాధించే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు ఇస్తున్నారు. ఇందుకోసం పాఠ్యాంశాలను నాలుగు విభాగాలుగా చేసి చదివించడంతోపాటు పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనితోపాటు మొత్తం సిలబస్‌పై రివిజన్ టెస్ట్‌లు పెట్టి విద్యార్థులతో పరీక్షల భయం పోగొట్టే విధంగా చేస్తున్నారు.

ఐటీడీఏ పరిధిలో 942 మంది విద్యార్థులు

కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో సుమారు 25 ఆశ్రమ పాఠశాలలు, 3 గురుకుల పాఠశాలల్లో ఈ ఏడాది 942 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరికి సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలను బోధించడంతోపాటు రివిజన్ టెస్ట్‌లు కూడా నిర్వహిస్తున్నారు. నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఐటీడీఏ అధికారులు 100 రోజుల ప్రత్యేక ప్రణాళికలు తయారు చేసి ముందుకు సాగుతున్నారు. అలాగే ఉదయం, రాత్రి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ చదువుల్లో వెనుకబడిన విద్యార్థులు సైతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేస్తున్నారు.

ఒత్తిడి లేకుండా చదవాలి



పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవడం నేర్చుకోవాలి. ఇష్టంగా చదవాలే తప్ప కష్టంగా కాదు. ఏదైనా సబ్జెక్టు చదువుతున్నప్పుడు పక్కనే ఒక నోట్‌బుక్ పెట్టుకుని కీలకమైన అంశాలను ఎప్పటికప్పుడు రాసుకోవాలి. నిర్భయంగా పరీక్షలు రాస్తే ఉత్తీర్ణత సాధించవచ్చు.
– పీవీఎస్ నాయుడు, ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్, కేఆర్‌పురం

బట్టీ పట్టే విధానాన్ని వదిలేయాలి



ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండుసార్లు అర్థమయ్యే విధంగా చదువుకోవాలి. బట్టీ పట్టే విధంగా కాకుండా సమాచార నైపుణ్యం, సామర్థ్యంపై ఇచ్చిన పట్టికలను, గ్రాఫ్‌లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మ్యాప్ పాయింటింగ్, బిట్స్, ఒక మార్కు ప్రశ్నలపై ప్రత్యేక దృష్టి పెడితే సులభంగా పదికి పది పాయింట్‌లు సాధించవచ్చు. బిట్ పేపర్‌లో జవాబులు, తప్పులు కొట్టివేతలు లేకుండా చేయాలి.
– పి. వసుంధరమ్మ, ప్రధానోపాధ్యాయురాలు, తెల్లంవారిగూడెం

మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు పరామర్శ



బాలరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నూజివీడు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

బుట్టాయగూడెం: దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజును నూజివీడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలరాజు తల్లి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాలరాజు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నేరాలకు వేదికగా సోషల్ మీడియా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సోషల్ మీడియా నేరాలకు వేదికగా మారిందని త్రీ టౌన్ సీఐ కోటేశ్వరరావు అన్నారు. నగరానికి చెందిన రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శ్రేయ 2025 ఫెస్ట్ సందర్భంగా సోషల్ మీడియా అనర్థాలపై ఇండోర్ స్టేడియం నుంచి శాంతి నగర్ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ప్రారంభించిన కోటేశ్వర రావు మాట్లాడుతూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగవచ్చునేమో గాని, అంతే స్థాయిలో నేరాలకు కూడా ఆస్కారముందని వివరించారు. సీఐ కోటేశ్వరరావు సోషల్ మీడియా వినియోగం – అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను వినియోగించడంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్, కళాశాల డీన్ శర్మ, డాక్టర్ బవిరిసెట్టి ప్రసాద్, చిరంజీవి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని వ్యాధులకూ వైద్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయుర్వేద వైద్య విధానంలో అన్ని వ్యాధులకు చికిత్స ఉంటుందని, సైడ్ ఎఫెక్ట్‌లు లేని మందులు అందుబాటులో ఉంటాయని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు నగేష్ అన్నారు. శనివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో నగేష్ వైద్య బృందంచే ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు.

పారిజాతగిరికి పోటెత్తిన భక్తులు



స్వామిని దర్శించిన హైకోర్టు జాయింట్ రిజిస్ట్రార్

జంగారెడ్డిగూడెం: భీష్మ ఏకాదశి, శనివారం సందర్భంగా స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అనేక మంది భక్తులు కాలినడకన వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించి ప్రత్యేక అష్టోత్తర పూజలు జరిపించుకున్నారు. హైకోర్టు జాయింట్ రిజిస్ట్రార్ ఎస్.వెంకటశ్రీరామూర్తి, లలితా కుమారి దంపతులు పారిజాతగిరివాసుడిని దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ కార్యనిర్వాహధికారి మానికల రాంబాబు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నల్లూరి రిషికేశ్ ఆచార్యులు, కుమారాచార్యులు, వేదపండితులు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలతో వారిని సత్కరించారు.

ఎండిన ఎర్రకాల్వ

- శాశ్వత సాగునీటి సదుపాయం లేకపోవడమే ప్రధాన కారణం
- ఎర్రకాల్వకు గోదావరి జలాలను అందించాలని రైతుల వినతి
- మేడవరపు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చాలని మొర



చింతలపూడి మండలం రేచర్ల సమీపంలో ఎండిన ఎర్రకాల్వ

చింతలపూడి: చింతలపూడి మండలం నుంచి ప్రారంభమయ్యే ఎర్రకాల్వ నేడు వట్టి పోయే దశకు చేరుకుంది. ఈ కాల్వకు శాశ్వత సాగునీటి సదుపాయం లేక పోవడమే దీనికి కారణమని ఇక్కడి రైతులు వాపోతున్నారు. మండలంలోని శెట్టివారిగూడెం సమీపంలో ఉన్న మేడవరపు చెరువు అలుగే ఎర్ర కాల్వగా మారి టి నరసాపురం మండలం నందమూరి విద్యాసాగర్ ప్రాజెక్టులోకి ప్రవహిస్తుంది. అయితే వర్షాకాలం రెండు మూడు రోజులు తప్ప మిగిలిన రోజుల్లో పెద్దగా నీరు ప్రవహించదు. గతంలో ఎర్రకాల్వ పొంగి చుట్టు పక్కల గ్రామాల పొలాలను ముంచెత్తుతుందని రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా దాదాపు రూ.4 కోట్లు ఖర్చు పెట్టి 17.5 కిలో మీటర్ల మేర కాల్వను అభివృద్ధి చేశారు. ఇప్పుడు చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కాల్వ ఈ కాల్వ పక్క నుంచే వెళ్తుండడంతో గోదావరి జలాలు వస్తాయని ఆశపడ్డ రైతులకు ఎత్తిపోతల పథకం ఎప్పుడు పూర్తవుతుందో అర్థం కావడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు కావస్తున్నా చింతలపూడి ఎత్తిపోతల పథకం ఊసే ఎత్తడం లేదు. అంతేకాక ఎర్రకాల్వకు ప్రధాన వనరుగా ఉన్న మేడవరపు చెరువు ప్రస్తుతం ఆక్రమణలకు గురై ఉంది. చెరువును ఆక్రమించుకుని కొందరు పంటలు పండిస్తున్నారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయి నీరు నిల్వ చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. ప్రభుత్వం ఆక్రమణలు తొలగించి, చెరువును మినీ ప్రాజెక్టుగా మార్చి అభివృద్ధి చేస్తే ఈ ప్రాంత రైతులకు ఉపయోగపడుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

గోదావరి నీరు అందించాలి



చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ఎర్రకాల్వకు గోదావరి జలాలను అందించాలి. జిల్లాలోనే అతిపెద్ద చెరువు అయిన మేడవరపు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలి. దీంతో వేలాది ఎకరాలకు శాశ్వత సాగు నీరు లభిస్తుంది.
– చేపూరి ఖాదర్ బాబు, మాజీ జెడ్పీటీసీ, చింతలపూడి

లక్ష్యాలకు అనుగుణంగా పశుగణన



రైతులకు మందులు అందజేస్తున్న జేడీ గోవిందరాజు

దెందులూరు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పశుగణన నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ ఏలూరు జిల్లా జాయింట్ డైరెక్టర్ గోవిందరాజు అన్నారు. శనివారం కొవ్వలిలో ఆయన పశుగణనను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి పశుగణన చేస్తున్నట్టు చెప్పారు. 2024 డిసెంబర్‌లో ఈ సర్వే ప్రారంభమైందన్నారు. ఆవులు, గేదెలు గొర్రెలు, మేకలు, గుర్రాలు, గాడిదలు, అడవి గేదెలు, కోళ్లు, నాటు కోళ్లు, బాతులు, కుక్కలతోపాటు 14 రకాల పశువులకు సంబంధించి గణన చేస్తున్నట్టు తెలిపారు. ఇది పరిశోధనతోపాటు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపునకు దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో కొవ్వలి వైద్యశాలలో మండల పశువైద్య శాఖ అధికారి రామ్మోహనరావు, స్థానిక సిబ్బంది ఉన్నారు.

బీసీలకు రాజ్యాధికారం అందించిన జగన్



వెంకట రమణను సత్కరిస్తున్న నాగరాజు

నిడమర్రు: ముఖ్యమంత్రిగా బీసీలకు రాజ్యాధికారం అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నౌడు వెంకటరమణ అన్నారు. పత్తేపురంలో ఆయన నివాసంలో పశ్చిమ గోదావరి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్నె నాగరాజుతో నౌడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు, జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతి వైఎస్సార్ సీపీ బీసీ కార్యకర్త కృషి చేసేలా జిల్లానుంచి వార్డు స్థాయివరకు ఓ ప్రణాళిక సిద్ధం చేసుకోనేలా చర్చ జరిగింది. ఈ సందర్భంగా నౌడు రమణ మాట్లాడుతూ జిల్లాలోని శాసన సభ నియోజకవర్గాల్లో పార్టీ కన్వీనర్లతో చర్చించి అన్ని నియోజకవర్గాల్లో బీసీ కమిటీలు త్వరితగతిన ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. తొలుత మన్నె నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు నౌడు రమణను మర్యాదపూర్వకంగా సత్కరించారు.

వైభవంగా భీష్మ ఏకాదశి



పోలవరం రూరల్: పట్టిసం గ్రామంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



టి.నరసాపురం: ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులు

పోలవరం రూరల్: భీష్మ ఏకాదశి సందర్భంగా పాత పట్టిసీమ, బోడిగూడెం గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం తులసి దళాలతో అర్చనలు జరిపారు. ఓం నమో వెంకటేశాయ నామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి. పట్టిసం గ్రామంలో డి.కృష్ణ దంపతులు అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే బోడిగూడెంలో వేంకటేశ్వరస్వామి వారి ఆలయ నిర్వాహకులు బూరుగు వెంకటేశ్వరరావు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



పోలవరం రూరల్: బోడిగూడెంలో విశేషాలంకరణలో స్వామివారు

టి.నరసాపురం: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా టి.నరసాపురం మండలం నుంచి పవిత్ర పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలకు భక్తులు పాదయాత్రగా వెళ్లారు. బొర్రంపాలెం గ్రామం నుంచి ద్వారకాతిరుమలకు సుమారు 100 మంది భక్తులు పాదయాత్రగా వెళ్లారు. ఈ కార్యక్రమానికి కృష్ణారావు, కాశి, బాలయ్య, చంటి, రామకృష్ణ తదితరులు ఆధ్వర్యం వహించారు.

నేత్రపర్వం.. ఏకాదశి ఉత్సవం



క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఉభయ దేవేరులతో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శనివారం రాత్రి శ్రీవారికి తిరువీధి సేవ అంగరంగ వైభవంగా జరిగింది. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి, సుగంధ భరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. అనంతరం అర్చకులు పూజాధికాలను జరిపి, హారతులిచ్చారు. ఆ తరువాత స్వామివారి వాహనం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. ప్రతి ఇంటి ముంగిటా భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.

వీరభద్రుని ఆలయ ఆధునీకీకరణ



స్వామివారి ఆలయ ఆధునీకీకరణ పనులు పూర్తి చేసిన భక్తులు

దెందులూరు: మండలంలోని పోతునూరు ఉన్నత పాఠశాల సమీపంలో వీరభద్రుని ఆలయ ఆధునీకీకరణ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా శనివారం సముద్ర, నది, ఏరుల జలాలతో ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. కొత్తూరు మహిళలచే లలితా విష్ణు పారాయణం చేశారు. కోదండరామ భజన సమాజం ఉండ్రాజవరం వారు భజన కార్యక్రమం నిర్వహించారు. బెజవాడ పల్లయ్య కుటుంబ సభ్యులు భక్తులకు ప్రసాదాన్ని వితరణ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం రికార్డుల పరిశీలన

దెందులూరు: థీమ్ అంగన్‌వాడీ కార్యక్రమం సక్రమంగా అమలుచేయాలని ఐసీడీఎస్ పోతు నూరు సెక్టార్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి అన్నారు. పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దెందులూరు మండలం పోతునూరు అంగన్‌వాడీ కేంద్రం నెంబర్–191లో థీమ్ అంగన్‌వాడీ పథకంపై కార్యకర్తలు, ఆయాలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. పిల్లలకు బరువులు పరీక్షలు చేశారు. పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆరోగ్య సంరక్షణ బాధ్యతలను వివరించారు. రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం రికార్డులు పరిశీలించి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.



థీమ్ అంగన్‌వాడీ కార్యక్రమంలో పాల్గొన్న సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి

వ్యక్తి దౌర్జన్యంపై కేసు

పెదవేగి: దౌర్జన్యం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి. విజయవాడ లయోలా గార్డెన్స్‌కు చెందిన జాస్తి వెంకటేశ్వరరావుకు పెదవేగి మండలం సూర్యరావుపేటలో 30 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ నిమిత్తం ఆగస్టు 2023లో పెదవేగి దిబ్బగూడెంకు చెందిన ఎం వసంతరావుని గుమస్తాగా పెట్టుకున్నారు. ఈ భూముల్లో ఉన్న మూడు మోటర్లు, మూడు స్టార్టర్లు, కేబుల్ కత్తులు వసంతరావు తీసుకెళ్లి సొంతానికి దుర్వినియోగం చేశాడని, వీటిపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేశాడని వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

బీజేపీ విజయంపై హర్షం

జంగారెడ్డిగూడెం: ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రజలు నరేంద్ర మోదీ పరిపాలన దక్షత మీద విశ్వాసం ఉంచి బీజేపీకి విజయాన్ని అందించారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అధిష్టానానికి, విజయానికి కారణమైన కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వీరభద్రుడి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి

కామవరపుకోట: కామవరపుకోటలో శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు స్వామి కల్యాణ మహోత్సవాలను ఆర్యవైశ్య, అఖిల గాండ్ల తెలికుల సంఘ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నారు. 12వ తేదీ తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల మధ్య స్వామి వారి కల్యాణం. కల్యాణం రోజున భక్తులు స్వామికి గండదీపాల మొక్కుబడి సమర్పించడం ఇక్కడి ప్రత్యేకత. సంతానం లేనివారు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంకాలం శిరసుపై దీపంతో ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుంటారు. సుదూర ప్రాంతాల నుంచి ఈ మొక్కుబడి చెల్లించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు.



ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణదేవరాయలు కాలంనాటి విజయ స్థూపం



తిరునాళ్లకు వచ్చిన భక్తులను ఆకట్టుకునేలా..